24.07.2020



## 3-30

## మున్నుడి

"కూచిపూడి" సంప్రదాయంలో నాయిక (సత్యభామ) ఆగమనాన్ని సూచిస్తూ వైతాళికులు 'భామనే సత్యభామనే...' అంటూ పాడుతారు. వారందరికీ అన్నమాచార్యులవారి ఇటువంటి కీర్తనలే స్ఫూర్తి అయివుంటాయి. అలమేల్మంగమ్మ రాకను ప్రకటిస్తున్నారు ఆచార్యులవారు. అమ్మవారి సౌందర్యాన్ని రమణీయంగా వర్ణిస్తున్నారు. పచ్చల కడియాల 'పణతి' చెలంగ... అంటే మరకతములు తాపిన చేతి కడియములతో ఆ పడతి విరాజిల్లగా... అని అర్థం. రంభాది అప్సరసలు వారినటనారంభాన్ని ప్రదర్శిస్తూ అమ్మవారిని సేవిస్తున్నారట. ఏమి భావన!!

**ఉ॥ వచ్చెను వేంకటేశ్వరుని భామినియౌ అలమేలుమంగ ఈ**
**పచ్చల తాపడంబుగల బంగరువౌ కడియాల్మెరంగ తాన్,**
**మచ్చికయైన కీరముల మాటలు మైమరపించె జవ్వనిన్**
**మెచ్చెడి కీర్తనంబు వినిపించెను మేలుగ అన్నమార్యుడున్**

**రాగం : హిందోళం**

వచ్చెను అలమేలు మంగ ఈ
పచ్చల కడియాల పణతి చెలంగ ॥వచ్చెను॥

బంగారు చేదివిటీలు పూని
శృంగారవతులు వేవేలు రాగా
రంగైన వింజామరలు వీవ
మాంగల్య లీల సొంపగు జవరాలు ॥వచ్చెను॥

పలుకుల తేనియ లొలుక చెంత
చిలుకలు కలకల పలుక రవల
గిలుకు పావలు ముద్దు గులుక మేటి
కలికి చూపుల మొనలు తళుకని చిలుక ॥వచ్చెను॥



Scanned with CamScanner

రంభాది సతులెల్ల చేరి ఎదుట
గంభీర గతులను మీర నటనా
రంభములను మేలు కోరి కొలువ
అంభోజాక్షుడౌ వేంకటేశునొయ్యారి ॥వచ్చెను॥

**భావామృతం :**

ఇదిగో చూడండి, ఇదే వచ్చెను అలమేల్మంగమ్మ. ఈమె మరకతములు తాపిన చేతి కడియములను ధరించి శోభిల్లుచున్నది.

అనేకమంది శృంగార పరిపూర్ణులైన చెలికత్తెలు బంగారు దివిటీలు (కాగడాలు) చేతిలో ధరించి వెంటరాగా అందమైన వింజామరలు (తెల్లని చామరము)చే వీచుటకు మరికొందరు ఆయత్తమవగా ఆ జవరాలి మాంగల్యము మనోహరముగా మెడలో వూగుచుండినది.

ఆమె పెంపుడు చిలుకలు, తేనెలొలుకునట్లు మధురముగా 'గలగల' పలుకుచుండినవి. ఆమె పావలు (పావుకోళ్ళు) ముద్దులొలుకు గిలుకు(సవ్వడి) ను చేయుచున్నవి, వాడియైన ఆమె చూపుల తూపులు తళుక్కుమని తళతళలను చిలుకుచున్నవి (వెదజల్లుచున్నవి).

రంభ మొదలైన అచ్చరలు అందరు చేరి ఆమె యెదుట గంభీరముగా నృత్యము సలుపుచుండిరి. వారి నటనా వైదుష్యమునంతయు ప్రదర్శించుచు ఆ దేవిని మేలుకొలుపు కొలువు సలుపుచున్నారు. పద్మదళాయతాక్షుడైన శ్రీవేంకటేశ్వరుని ఒయ్యారి భామ అయిన ఆదేవి మనోజ్ఞమైనది.



Scanned with CamScanner